యిరుగుపొరుగుల దగ్గర వాటి మంచిచెడ్డలగురించీ ధరలు తగ్గే అవకాశం గురించీ కూపీల్లాగుతున్నది. ఇహ డబ్బు చేతిలోకి రావటం ఆలస్యం. అంతే.

ఎక్కడో చీరాలలో స్థిరపడిపోయినవాళ్ళు-కొండయ్యవుంటున్న పాక సొంతదార్లు-ఎవరిదో పెళ్ళికని నెల్లూరు వచ్చారు. దారిలో ఇల్లు చూసుకుందామని ఆగారు. ఇల్లు చూసి, ఇరుగుపొరుగుల్తో మాట్లాడినాక అద్దె పెంచాలని అనుకున్నారు. "మేము యిక్కడికే వచ్చేయ్యాలని అనుకుంటున్నాం. మీరు మా ఇల్లు వదిలెయ్యండి" అన్నారు. ఎక్కడ కనుక్కున్నా కాస్త పూరింటికే పదిరూపాయల అద్దె అడుగుతున్నారు. ఈ పడిపోయిన పాకని తీసుకుని గట్టి చేసుకుని నిలబెట్టేసరికి ఇన్నాళ్ళబట్టీ దిక్కూ దివాణం లేకుండా పడివున్నదానికి విలువొచ్చేసింది. ఇంటివాళ్ళ కన్ను కుట్టింది. ఆఖరికి బేరసారాలయ్యాక ఇంటివాళ్ళు వచ్చేవరకూ నెలకు అయిదురూపాయలు అద్దె ఇస్తూ ఆ ఇంట్లో కొండయ్యే ఉండేట్లు ఏర్పాటయింది.

అద్దె ఎక్కువైందన్న బాధవున్నా ప్రస్తుతానికి ఏదో ఒక విధంగా గండం గడిచిందని సంతోషించారు. సుబ్బడు ఒళ్ళు చేశాడు. మనిషిని గుర్తుపట్టి నవ్వుతున్నాడు. రాత్రిళ్ళు అన్నాలు తిన్నాక సుబ్బణ్ని ఆడించుకుంటూ కబుర్లు చెప్పుకుంటారు ఇద్దరూ. అవసరాన్ని మించి మాట్లాడ్డం అలవాటులేని గౌరికూడా నవ్వుకుంటూ సంతృప్తితో కబుర్లాడుతున్నది.

కొండయ్య తన యజమాని కబుర్లు చెప్తే గౌరి ప్రెసిడెంటు ఆనందయ్యగారి యింటి విషయాలు చెబుతున్నది. ముఖ్యంగా వారి ఏకైక పుత్రుడు నారాయణబాబుగురించి. ఆ అబ్బాయి గౌరికంటే చిన్నవాడు కాదు. కాని ఎందుకో గౌరి మనసులో ఆ అబ్బాయికీ సుబ్బడికీ అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది.

సుబ్బడు పెద్దయితే నారాయణబాబులా అవ్వాలి. అందుకే గౌరి ఆ బాబు తాజా వార్తలన్నీ తూచా తప్పకుండా చెపుతూ వుంటుంది. ఆ అబ్బాయి బలే తమాషాగా మాట్లాడుతాడట. వాళ్ళమ్మని అల్లరిపట్టిస్తాడు. ఆమె దేవుళ్ళని వేళాకోళం చేస్తాడు... అంత వినాయకుడూ పాపం, ఆ చిన్న ఎలుకమీద కూచుంటే అది నలిగి ఛస్తుంది. యమధర్మరాజు వాహనంగా ఒక ఎద్దో ఆవో దొరక్క పాపం అందాకా దున్నపోతునెక్కి తిరుగుతున్నాడు. ఈశ్వరుడు మంచి వాసనపౌడరు దొరక్క పిచ్చి బూడిద పూసుకుని కంపుకొట్టే పాత పులితోలు చుట్టుకొని... "అయ్యో ఏమి దేవుళ్ళమ్మా నీ దేవుళ్ళు!" అని నవ్వుతాడు. "అసలు దేవుడు మనిషిని చేశాడా! మనిషి దేవుణ్నిచేశాడా? మనిషి తలచుకొని చెప్పుకొని గుళ్ళుకట్టి పూజించకపోతే దేవుడు ఎట్లా ఉంటాడు?" అంటాడు.

అన్నీ తలక్రిందులుగా మాట్లాడుతాడట. అమ్మగారు "ఈ కాలపు చదువుకున్న కుర్రాళ్ళు! నాస్తికులు!" అని నవ్వుకుంటారుట.

దుఃఖంలోనుంచీ నిరాశలోనుంచీ యెలా బయటపడాలో తోచనట్లు ఆకాశానికీ, భూమికీ మధ్యన బందీలాగా కళావిహీనంగా నిలబడిపోయాడు. నల్లటి శీతాకాలపు రాత్రి ఆ చంద్రుడి ఎరుపుకు కరిగిపోలేదు. మసక వెల్తురులో గౌరికి తలనిండా ఆలోచనలు ముసురుకున్నాయి. ఎక్కడ చూసినా ఏమిటో నీడలు కదుల్తున్నట్లు కనిపించి భయమేసింది. 'అమ్మయ్యో, ఈ మసక చీకట్లో ఏ దయ్యమన్నా వొచ్చి మీద కూచుని పీక నులిమేస్తే...' అనుకున్నది. భయంతో ఊపిరాడలేదు. మంచం తీసుకుని మళ్ళీ యింట్లోకి వెళ్ళింది.

ఓ మూలన ఎంకమ్మ దగ్గర ముడుచుకు పడుకున్నాడు చినసుబ్బడు. ఎంకమ్మ మూలుగుతూ ఒక ప్రక్కకు వొత్తిగిలింది. దీపం వెల్తుర్లో పత్తికాయల్లా కనబడుతున్నవి ఆమె కళ్లు. కొండయ్య అప్పుడే మంచి నిద్రలోకి జారిపోయాడు. ఎంత సేపటికీ నిద్రపట్టని గౌరి ఊరికే చీకట్లోకి చూస్తూ వుండిపోయింది.

★★★

గౌరి వాళ్ల కట్టలో కూలీలు రెండు మైళ్ళవతల నారేతకు పోతున్నారు. మధ్యాహ్నం అందరికీ అన్నాలు తీసుకురావటానికి గౌరి ఊళ్ళోకి వచ్చింది. ఎంకమ్మ పోయినప్పటినుంచీ మధ్యాన్నాలు ఇంటికి వెళ్ళి సుబ్బడికి అన్నంపెట్టి తనూ తిని, అందరి అన్నాలు గంపలో పెట్టుకుని తెస్తున్నది.

ఆ రోజు మిట్టమధ్యాన్నం అన్నాలగంప నెత్తిమీద పెట్టుకుని పొలాల గట్లమీద నడిచి వొస్తున్నది. చూపుమేరలో మనిషి తిరగటం లేదు.

కళ్ళముందుగా ఏదో నీడలాంటి నల్లని ఆకారం కదిలింది. గౌరి నెత్తిమీది గంపజారి క్రిందపడ్డది. భీతిల్లి క్రిందికి చూసింది. కడుపులోనుంచీ ఒణుకు ప్రారంభమై వీపులోకి ప్రాకింది. భయంతో పరుగు పుచ్చుకుంది.

అక్కడే బొక్కబోర్లా పడిపోయింది. ప్రక్కనే నేలమీద చెల్లాచెదురుగా అన్నం కారియర్లు. కొన్నిటికి మూతలూడిపోయి అన్నమూ, పచ్చళ్ళూ, కూరలూ మట్టిగొట్టుకుపోయాయి.

దూరాన్న పొలంలోని కూలీలు చూచి పరుగెత్తుకుంటూ వచ్చారు. మొఖాన్న నీళ్ళు కొట్టి తెలివి వొచ్చినాక ఇల్లు చేర్చారు.

పిచ్చిచూపులు చూస్తున్నది గౌరి. గాలి తగిలిందన్నారు. పడినచోటు మంచిదికాదన్నారు. మందులూ మంత్రాలూ వేయించారు. దయ్యం దిగలేదు.

రాజమ్మను పిలుచుకొచ్చాడు కొండయ్య. "ఆ దోవన యెందరు మనుషులు పోవటంలేదు! దీనినే పట్టుకోవాలా ఆ దయ్యం... రాగానే వేరు కాపరం పెట్టించింది. దాని మనసు మంచిదికాదు. అందుకే దయ్యం పట్టుకుంది" అని గొణుగుతూనే వుంది

